# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 13-04-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- అనకాపల్లి జిల్లా కైలాసపట్నంలో బాణాసంచా తయారీ కేంద్రం ప్రమాదం పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.
- సహకార మంత్రిత్వ శాఖ ఏర్పాటుతో సహకార రంగంలో భారతదేశం పరివర్తనాత్మక మార్పులను సాధించిందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు.
- దేశవ్యాప్తంగా రహదారులను బలోపేతం చేసేందుకు 10 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టాలని ప్రభుత్వం యోచిస్తోందని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు.
- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రేపు హర్యానాలోని పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్నారు.

====================

అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం కైలాసపట్నంలో బాణాసంచా తయారీ కేంద్రంలో ఈ రోజు భారీ పేలుడు సంభవించడంతో 8 మంది మృతి చెందారు. ఈ ఘటనలో మరో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ విషాదంపై ప్రదానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో జరిగిన ప్రాణనష్టం అత్యంత బాధాకరమని పేర్కొంటూ.. ఈ ప్రమాదంలో తమ ఆత్మీయులను కోల్పోయిన వారికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి నుంచి 2 లక్షల రూపాయాలు, గాయపడిన వారికి 50 వేల రూపాయల పరిహారం ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున మృతుల కుటుంబాలకు 15 లక్షల రూపాయల చొప్పున పరిహారాన్ని హోం మంత్రి వంగలపూడి అనిత ప్రకటించారు.

====================

సహకార మంత్రిత్వ శాఖ ఏర్పాటుతో సహకార రంగంలో భారతదేశం పరివర్తనాత్మక మార్పులను సాధించిందని కేంద్ర హోం, సహకార మంత్రి అమిత్ షా అన్నారు. భోపాల్ లో ఈ రోజు జరిగిన రాష్ట్ర స్థాయి సహకార సదస్సులో అమిత్ షా ప్రసంగిస్తూ... భారతదేశ చరిత్రలో మొట్టమొదటిసారిగా ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం,

పశుసంవర్ధక రంగాలను ఏకీకృత విధానంతో ఏకం చేసిందన్నారు. విత్తన, సేంద్రియ, ఎగుమతి సహకార సంఘాల ద్వారా రైతులకు గిట్టుబాటు ధర లభించడంతో పాటు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో చెల్లింపులు జరుగుతున్నాయని తెలిపారు. ప్రస్తుతం 20కి పైగా రాష్ట్రాల్లో పని చేస్తున్న ప్రాధమిక వ్యవసాయ పరపతి కేంద్రాల ప్రాధాన్యత పెరుగుతోందని అమిత్ షా తెలియజేస్తూ...

(వాయిస్ 34 సెకన్లు)

=====================

దేశవ్యాప్తంగా రహదారులను బలోపేతం చేసేందుకు వచ్చే రెండు సంవత్సరాల్లో 10 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టాలని ప్రభుత్వం యోచిస్తోందని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. ఈరోజు ఒక వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.... ఈశాన్య రాష్ట్రాల్లోని క్లిష్టమైన భూభాగం, పలు దేశాలతో సరిహద్దులకు దగ్గరగా ఉన్నందున అక్కడ రహదారుల మౌలిక సదుపాయాలను పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వచ్చే రెండేళ్లలో దేశంలోని మౌలిక సదుపాయాలను సమూలంగా మార్చడానికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. తూర్పు రాష్ట్రాల్లో 3 లక్షల 70 వేల కోట్ల రూపాయల అంచనా వ్యయంతో 21 వేల 300 కిలోమీటర్లకు పైగా 784 హైవే ప్రాజెక్టులను అమలు చేయనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. నాగ్ పూర్ లో 170 కోట్ల రూపాయల వ్యయంతో మాస్ ర్యాపిడ్ ట్రాన్స్ పోర్ట్ పైలట్ ప్రాజెక్టును చేపడుతున్నామని నితిన్ గడ్కరీ తెలిపారు.

=====================

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రేపు హర్యానాలో పర్యటించనున్నారు. ఉదయం హిస్సార్ కు చేరుకుని హిసార్ నుంచి అయోధ్యకు వాణిజ్య విమానాన్ని జెండా ఊపి ప్రారంభించి, హిసార్ విమానాశ్రయం నూతన టెర్మినల్ భవనానికి శంకుస్థాపన చేస్తారు. బహిరంగ సభలో ప్రధానమంత్రి ప్రసంగించనున్నారు. అనంతరం యమునానగర్ లో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించి, శంకుస్థాపన చేసి ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. యమునానగర్ లో దీనబంధు ఛోటు రామ్ థర్మల్ పవర్ ప్లాంట్ లో 800 మెగావాట్ల ఆధునిక థర్మల్ పవర్ యూనిట్ కు, ముకరబ్ పూర్ లో కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ కు శంకుస్థాపనలు చేయనున్నారు. భారత్ మాల పరియోజన కింద సుమారు 1,070 కోట్ల రూపాయల విలువైన 14.4 కిలోమీటర్ల రేవారీ బైపాస్ ప్రాజెక్టును నరేంద్ర మోదీ ప్రారంభించనున్నారు.

విరామం

=====================

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. బాబాసాహెబ్ తన స్ఫూర్తిదాయక జీవితంలో, తీవ్రమైన కష్టాలను ఎదుర్కొన్నప్పటికీ తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపును ఏర్పరుచుకున్నారని, తన అసాధారణ విజయాలతో ప్రపంచవ్యాప్తంగా గౌరవాన్ని పొందారని రాష్ట్రపతి తన సందేశంలో పేర్కొన్నారు. సమసమాజం కోసం అంబేద్కర్ ఎంతగానో ఉద్యమించారని, మహిళలు, అణగారిన వర్గాల ఆర్థిక, సామాజిక హక్కుల కోసం ఆయన జీవితాంతం పోరాటం చేశారని రాష్ట్రపతి అన్నారు.

=====================

డాక్టర్ భీం రావ్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని దేశ రాజధానిలో ఈ రోజు ఢిల్లీ ప్రభుత్వం వాకథాన్ నిర్వహించింది. వేలాది మంది చిన్నారులు పాల్గొన్న ఈ వాకథాన్ ను ముఖ్యమంత్రి రేఖా గుప్తా జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ...బాబాసాహెబ్ నిర్దేశించిన సూత్రాలను నిలబెట్టడానికి, ప్రజలకు తగిన విద్య, వైద్యం, సమానత్వం లభించేలా చూడటానికి ఢిల్లీ ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు.

=====================

డాక్టర్ భీమ్ రావ్ అంబేడ్కర్ దార్శనికత నుంచి స్ఫూర్తి పొంది అభివృద్ధి చెందిన భారతాన్ని నిర్మించాలని కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ యువతకు పిలుపునిచ్చారు. బీహార్ రాష్ట్ర రాజధాని పాట్నా లో ఈరోజు నిర్వహించిన జై భీమ్ యాత్రను కేంద్రమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మై భారత్ యువత, వాలంటీర్లను ఉద్దేశించి ఆయన ప్రసంగిస్తూ.... భారత రాజ్యాంగ స్ఫూర్తిని దేశ యువత గౌరవించాలని, కట్టుబడి ఉండాలన్నారు. భారతీయ పౌరుల్లో కర్తవ్య భావన, బాధ్యతపై దృష్టి సారించి 'నేషన్ ఫస్ట్' స్ఫూర్తిని పెంపొందించాల్సిన అవసరం ఉందని కేంద్రమంత్రి పేర్కొన్నారు.

=====================

నేషనల్ ఫోరెన్సిక్ సైన్సెస్ యూనివర్సిటీ - (ఎన్ఎఫ్ఎస్యూ) ఆధ్వర్యంలో ఫిల్మ్ ఫోరెన్సిక్స్ పై చర్చా వేదికను ఈ రోజు న్యూ ఢిల్లీలో నిర్వహించారు. ఫోరెన్సిక్ నిపుణులు, చిత్ర నిర్మాతలు, విద్యార్థుల మధ్య సంభాషణ, సహకారానికి ఒక వేదికను సృష్టించడం, సైన్స్, సత్యదూరమైన సినిమా కథల మధ్య అంతరాన్ని తగ్గించడం ఈ కార్యక్రమం లక్ష్యం. ఈ కార్యక్రమానికి అతిథిగా హాజరైన లోక్ సభసభ్యురాలు, ప్రముఖ నటి హేమమాలిని మాట్లాడుతూ... విజ్ఞాన శాస్త్రానికి, సామాన్య ప్రజానీకానికి మధ్య అనుసంధానంగా సినిమాలు పని చేస్తాయని వ్యాఖ్యానించారు. ఫోరెన్సిక్ సైన్స్ కు డిమాండ్ అనూహ్య స్థాయికి చేరుకుందని ఆమె అన్నారు.

=====================

భారత్ - రష్యా దౌత్య సంబంధాల 78వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈ రోజు న్యూఢిల్లీలో నిర్వహించిన సైకిల్ ర్యాలీలో 300 మందికి పైగా పాల్గొన్నారు. 1941-1945 నాటి గ్రేట్ పేట్రియాటిక్ యుద్ధంలో రష్యా విజయం సాధించిన 80వ వార్షికోత్సవాన్ని కూడా ఈ సైక్లింగ్ ర్యాలీ సందర్భంగా మననం చేసుకున్నారు. భారతదేశంలో రష్యా రాయబారి డెనిస్ అలిపోవ్ దౌత్య సంబంధాల 78వ వార్షికోత్సవం సందర్భంగా సామాజిక మాధ్యమ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. రాజకీయాలు, వాణిజ్యం, సాంకేతిక పరిజ్ఞానం, సైన్స్, విద్య, సంస్కృతి రంగాల్లో రష్యా - భారత్ వ్యూహాత్మక భాగస్వామ్యానికి ఎంతో ప్రత్యేకత ఉందని రష్యా రాయబార కార్యాలయం పేర్కొంది.

=====================

ఈరేజు నుంచి దేశంలోని వివిధ ప్రాంతాల్లో సాంప్రదాయ పంట కోతల ఉత్సవాలు జరుగుతున్నాయి. పంజాబ్ ప్రజలు 'వైశాఖి' అని, కేరళీయులు 'విషు' అని, పశ్చిమ బెంగాల్లో 'పోయిలా బోయిషాఖ్'గా, అస్సోంలో 'బోహాగ్ బిహు' అని జరుపుకుంటారు. తమిళనాడులో ప్రజలు ఈ పండుగను 'పుత్తండు'గా జరుపుకుంటారు. దేశంలోని ఉత్తర భాగంలో, ప్రజలు ఈ రోజు వైశాఖి వసంత పంట పండుగను పూర్తి ఉత్సాహంతో, సోదరభావంతో జరుపుకుంటున్నారు. ముఖ్యంగా పంజాబ్, హరియాణా రైతులు మంచి దిగుబడి కోసం తమ కృతజ్ఞతను వ్యక్తం చేస్తూ... రాబోయే సంవత్సరంలో శ్రేయస్సు కోసం ప్రార్థిస్తున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్ ఖర్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

=====================
=====================